

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**శశిభూషణ్ తల పంకించాడు.**

"బ్లేడర్ ఎక్స్‌పేండ్ అవటంవల్ల జీర్ణాశయంలోకి వెళ్ళిన ఆహారానికి చోటుండక వాంతుల ద్వారా అది బయటకి వచ్చేస్తోంది. క్రమంగా ఆకలి మందగించిపోతుంది చివరికి. మీ నిర్ణయం ఎంత త్వరగా తీసుకుంటే అంత మంచిది."

సాంబశివరావు కన్సల్టింగ్ ఫీజు చెల్లించి అడిగాడు.

"ఆపరేషన్‌కి మొత్తం ఎంత ఖర్చవచ్చు?"

"నా ఫీజ్, ఎన్స్తీషియన్ ఫీజ్, హాస్పిటల్‌లో ఖర్చులు కలుపుకుని అయిదువేలవుతుంది."

ఇద్దరూ బయటకి వచ్చారు.

"డామిట్ సావిత్రి ఇందుకనే ఈ రాజేష్‌ని మనమీదకి తోలింది" కసిగా చెప్పాడు సాంబశివరావు.

"అలా ఎందుకనుకోవాలి? సావిత్రి రాజేష్‌కి ఇదివరకెప్పుడూ ఎక్స్‌రేలు తీయించలేదు. డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళలేదు. కాబట్టి ఈ రోగం గురించి తెలిసే వుండదు" జవాబు చెప్పింది నీరజ.

"వాటేపిటీ" చెప్పాడు దశరథరామయ్య. నీరజ రాజేష్ వినకుండా రహస్యంగా డాక్టర్ చెప్పిన విషయాలు ఆయనకి చెప్పగానే.

"ఏం చేద్దామంటారు?" అడిగింది.

"ఆపరేషన్ చేయించకపోతే చాలా కాంప్లికేషన్స్ వస్తాయి. అంతదాకా ఆగేకంటే చేయించటమే మంచిదని నా అభిప్రాయం" చెప్పాడు సాంబశివరావు.

"రాజేష్ నీ కొడుకు కాదా నిజంగా?" అడిగాడు దశరథరామయ్య.

"కాదు" చిరాగ్గా చెప్పాడు ఆ ప్రసక్తికి.

"కానప్పుడు రాజేష్ తల్లిదండ్రులకి తెలియకుండా ఆపరేషన్ ఎలా చేయటం? ఏదైనా చెడు జరిగితే వాళ్ళకి ఏం సమాధానం చెప్పగలం?"

"మన దగ్గరికి రాజేష్‌ని పంపించినప్పుడే, వాడి బాధ్యతలన్నీ మనకప్పగించినట్లేకదా? చేయించకపోతే, రేపు ఏదైనా చెడు జరిగితే అప్పుడు కూడా బాధ్యత మనదేగా? వాడు నా కొడుకు కాదన్నమాట మర్చిపోయి, వాడే నా కొడుకయితే

నేనేం చేసేవాణ్ణి అని ఆలోచిస్తే ఆపరేషన్ తప్పనిసరి అయినప్పుడు అది త్వరగా చేయిస్తే మంచిదనిపిస్తోంది నాన్నగారు. కానీ చాలా ఖర్చవుతుంది. ఎక్సరేలకే వందల్లో అయింది.

ఆయనా, కొడుకు, కోడలు దాదాపు అరగంటదాకా ఆ విషయం చర్చించారు. ముగ్గురూ ఓ ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

నీరజ అన్యమనస్కంగానే వంట చేసింది. నిజానికి ఆ రోజు ఎవరూ సరిగ్గా భోజనం చేయలేదు. ఇంకా దిగులుగా వున్న రాజేష్‌ని చూస్తే నీరజకి బాధగా వుంది. వాడి మనసులోంచి బాధని పోగొట్టాలనుకుంది.

"నీకో మంచి కథ చెప్పనా?" అడిగింది.

"వద్దు పిన్నీ. టింకూ మళ్ళీ తిరిగి వస్తుందా రాదా?"

"సరే. కథ వద్దులే. వస్తుంది. చిట్టి దగ్గరకి వెళ్ళివుంటుంది"

"చిట్టెవరు?"

"చిట్టి ఎవరో నీకు తెలియదా?" అడిగింది ఆశ్చర్యం నటిస్తూ.

"ఊహూఁ"

"నీకు తెలుసేమో అనుకున్నాను."

"తెలీదు. చెప్పు పిన్నీ"

"చిట్టి నీలాగే సెకండ్ స్టాండర్డు చదువుతోంది. ఆ అమ్మాయి బాగా అల్లరిపిల్ల. ఎప్పుడూ దిండుమీద తల బదులు కాళ్ళు పెట్టుకుని పడుకుంటుంది. చిన్న గుర్రపు పిల్లమీద ఎక్కి తిరుగుతుంటుంది. స్కూలుకెళ్ళాలనిపిస్తే వెళుతుంది. లేదా వెళ్ళదు. వాళ్ళింట్లో చిట్టితోపాటు ఇద్దరు స్నేహితులున్నారు. ఒకటేమో కోతి, ఇంకొకటి చిన్న ఏనుగుపిల్ల. చిట్టి స్కూలు గోడమీద ఆ ఏనుగుపిల్ల బొమ్మ గీసింది. ఎందుకంటే కాగితం మీద ఏనుగుబొమ్మ పట్టదుగా. వర్షం వస్తుందని అనుమానం కలిగితే చాలు. సుబ్బులు చూడగానే స్కూలు గంట కొట్టేస్తుంది. పిల్లలంతా ఇంటికి పరుగెత్తుతారు."

రాజేష్ ఎంతో ఆసక్తిగా వింటున్నాడు నీరజ చెప్పేది.

"చిట్టి వంటరిగా వుంటోంది. రోజూ ఏది కావాలంటే అది చేసుకుని తింటుంది. ఓ రోజు మైసూర్ పాక్, ఓ రోజు జాంగ్రి, పాలకోవా, గులాబ్‌జామ్, బెనారస్ పాపిడి, జిలేబి, లడ్డు, బాదుషా, తియ్యకారప్పుస, తియ్యగవ్వలు.. యిలా రోజుకొకటి. చిట్టి గౌనునిండా ఎప్పుడూ చక్కెర వుంటుంది. రోజూ బాత్ రూంలో గంటసేపు నీళ్ళతో ఆడుకుంటూ స్నానం చేస్తుంది. తర్వాత చెట్టెక్కుతుంది. చెట్టుకొమ్మనున్న ఉయ్యాలలో ఇష్టం వచ్చినంతసేపు వూగుతుంది. చిట్టి యింటినిండా బాదం చెట్లు, జామచెట్లు, పక్కింట్లో మామిడి చెట్టుంది. గోడదూకి వెళ్ళి దొంగతనంగా ఆ చెట్టెక్కి మామిడిపిందెలు కోసి తినేస్తుంది. ఒకోసారి ఇసక తీసి చిట్టి తోటిపిల్లల తలమీద గుప్పిళ్ళతో చల్లుతుంది. వాళ్ళకి దొరక్కుండా పారిపోతుంది. చిట్టి తన ఇష్టం వచ్చినప్పుడు నిద్రలేస్తుంది. ఎప్పుడు సినిమాకి వెళ్ళాలనిపిస్తే అప్పుడు వెళ్ళిపోతుంది. పాప్‌కార్న్ కొనుక్కుని సినిమా చూస్తూ తింటుంది. చిట్టి వంట గదినిండా గాజుతో నిండిన పాత్రలే. ఒక్కోసారి వాటిని నేలకేసికొట్టి పగలగొడుతుంటుంది. చిట్టికి మంచి బట్టలు వేసుకోవాలనే వుండదు. మాసిన బట్టలు వేసుకుంటుంది. మంచివి తొడుక్కున్నా ఎంచక్కా బురద నీళ్ళలో ఆడుకుంటుంది. ఎవరయినా యింటికి వచ్చి కూర్చుని మాట్లాడుకుంటుంటే, వాళ్ళ రెండు కాళ్ళ బూట్లు లేసులు చిన్నగా విప్పి, ఒకదానితో మరొకటి ముడివేస్తుంది. లేదా పడక్కుర్చీకుండే కర్రని తీసేస్తుంది. అప్పుడు దాంట్లో ఎవరు కూర్చుంటే వాళ్ళు కిందపడతారు స్కూల్లో టీచర్ కుర్చీలో

కూర్చోబోతే వెనకనుంచి సరిగ్గా ఆ సమయానికి దాన్ని లాగేస్తుంది. మేడం పాఠం చెప్తూంటే చాక్‌పీస్ ముక్కలని ఆమె మీదకి దొంగతనంగా విసురుతుంటుంది. ముందు కూర్చుని శ్రద్ధగ పాఠం వింటున్న వాళ్ళ వీపుమీద యింకు చల్లుతుంది. అర్ధరాత్రుళ్ళు పెద్ద కర్ర తీసుకుని వీధిలో వెలిగే వీధి దీపాలని బద్దలుకొట్టి పారిపోతూంటుంది.

రాజేష్ ఎంతో ఆసక్తిగా, శ్రద్ధగా వింటున్నాడు నీరజ చెప్పే కథ. నీరజ ఆగకుండా అలా చెప్పుకుపోతూనే వుంది. ఆమెది చిన్నపిల్లల మనస్తత్వం. వాళ్ళు ఏం చేయడానికి ఉత్సాహపడతారో, కానీ అది చేయడానికి పెద్దలు అడ్డుపడతారో, కేవల ఆ పనులే చేస్తూ వంటరిగా బ్రతికే చిట్టి కథ చెప్తే ఎంతో ఉత్సాహంగా వుంటుంది. సర్వం మరచిపోయి చిట్టి గురించి యింకా తెలుసుకోవాలనుకుంటారు.

రాత్రి రాజేష్‌కి నిద్ర వచ్చేదాకా నీరజ చిట్టి గురించి చెప్తూనే వుంది. ఆ రాత్రి రాజేష్ కలలనిండా టింకూ, చిట్టీలే.

మర్నాడు ఉదయం నిద్రలేచాక కూడా రాజేష్ తన టింకూ కోసం వెదికాడు. అది కనపడకపోవడంతో వాడి దిగులు తగ్గలేదు.

"కాసేపు నువ్వూ, బన్నీ బయటకి వెళ్ళి ఆడుకుని రండి" చెప్పాడు దశరథరామయ్య రాజేష్ దిగులుగా ఓ మూల కూర్చోవడం చూసి.

బన్ని బలవంతంగా చెయ్యి పట్టుకుని తీసుకువెళ్ళింది రాజేష్‌ని. ఇంటి సందు చివర కడుతున్న ఇంటికోసం తెచ్చిన ఇసక కుప్పమీద యిద్దరూ ఆడుకోసాగారు. బన్ని పుల్లని ఇసకలో దాచి దాన్ని కనుక్కునే ఆట, కుడికాలు యిసకలో వుంచి వేలుతో ఓ చోట పొడిచి బొటనవేలు ఎక్కడుందో కనుక్కోవటంలాంటి ఆటలు ఆడుకోసాగారు.

అకస్మాత్తుగా రాజేష్ చూపు రోడ్డుమీద వెళుతున్న ఆటోమీద పడింది. ఊపిరి పీల్చుకోవడం కూడా మరిచిపోయి అటు చూస్తుండిపోయాడు కొన్ని క్షణాలు.

కొన్ని క్షణాలే, అది వెళ్ళిపోయింది.

రాజేష్ కాళ్ళలోంచి విద్యుత్ పాకినట్లయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి ఇంటివైపు పరుగెత్తసాగాడు.

"ఒరే ఆగరా! ఎందుకు పరిగెత్తుతున్నావ్" అడిగింది బన్ని కూడా వాడివెంట పరిగెడుతూ.

రాజేష్ ఆగలేదు. వగరుస్తూ, ఓసారి కిందపడి లేచి, మళ్ళీ పరిగెత్తసాగాడు.

బయటనుంచే 'తాతయ్యా, తాతయ్యా' అని గుండెలదిరిపోయేలా అరుస్తూ ఇంట్లోకి పరుగెత్తాడు.

"ఏమిటి?" అడిగాడు దశరథరామయ్య.

"అక్కడ...అక్కడ.." బయటకి చేతిని చూపిస్తూ చెపుతూంటే ఆయాసం అడ్డుపడటంతో చెప్పలేకపోయాడు.

రాజేష్ మొహంలోని సంతోషం ఎక్సయిట్‌మెంట్ చూసిన దశరథరామయ్య అడిగాడు ఆత్రంగా.

"అక్కడ? ఏమిటక్కడ?"

చాలాదూరం పరిగెత్తడంవల్ల ఆయాసంతో రాజేష్ మాట్లాడాలేక పోయాడు.

బన్ని వంక చూశాడు ఏమిటన్నట్లుగా. ఆ పిల్లా తనకి తెలియదన్నట్లుగా తల అడ్డంగా వూపింది.

"అక్కడేమిటి?" అడిగాడూ దశరథరామయ్య మళ్ళీ.

"ఇప్పుడే చూశా తాతయ్యా! మనకింతదాకా తెలియదు కాని మన వూరొచ్చేసింది" చెప్పాడు రాజేష్ గుక్క తిప్పుకోకుండా.

"ఎవరొచ్చారు?" అడిగాడు దశరథరామయ్య.

"సర్కస్. మన వూరికి సర్కస్ వచ్చింది తాతయ్యా" ఎగ్జయిటింగ్‌గా చెప్పాడు రాజేష్.

"సర్కస్ వచ్చిందా? నాకు తెలీదే నువ్వెప్పుడు చూసావ్‌రా" అడిగింది బన్ని రాజేష్‌ని భుజంమీద గట్టిగా గిల్లి.

"ఇందాక మనం ఆడుకుంటుండగా చూశాను, ఆటో రిక్షాకి పోస్టర్లు కట్టి తీసుకెళుతుంటే. తాతయ్యా! నన్ను సర్కస్‌కి తీసుకెళ్ళవూ? ఇంతదాకా నేను చూడనేలేదు. నేను పుట్టకమునుపు వచ్చింది సర్కస్ మా వూరికి. మళ్ళీ రానేలేదు. అందులో సింహాలు, పులులు, ఏనుగులు, గుర్రాలు అన్నీ మనం చెప్పినట్లు చేస్తాయిటగదా! బఫూన్‌లు ఇలా గెంతులేస్తారట"

రెండు పిల్లిమొగ్గలు వేసి చూపించాడు రాజేష్.

రాజేష్ మొహంలో, మాటల్లో ఉత్సాహం చూస్తే ఎవరూ కాదనలేరు. ముఖ్యంగా దశరథరామయ్య.

"అలాగే వెళ్దాంలేరా" చెప్పాడు.

"ఎప్పుడు వెళదాం తాతయ్యా?"

"అసలది ఎక్కడ ఆడుతుందో తెలుసుకోవాలిగా? మీ పిన్ని వచ్చాక అడుగుదాం."

"నన్నూ మీతో తీసుకెళ్ళాలి" చెప్పింది బన్ని గారాంగా.

"నిన్ను చస్తే తీసుకెళ్ళను. బెల్ నొక్కుతుంటావుగా" చెప్పాడు దశరథరామయ్య.

బన్ని ఆయన్ని వెక్కిరించి బయటకు వెళ్ళి బెల్ నొక్కసాగింది ఆయన బన్ని దగ్గరకు వెళ్ళేసరికి తుర్రుమంది.

"ఏరా! కర్రా బిళ్ళా ఆడదామా?" అడిగాడు దశరథరామయ్య.

"వద్దు తాతయ్యా! బిళ్ళ వచ్చి కంట్లో గుచ్చుకుంటే? అమ్మెప్పుడూ ఆడనిచ్చేదికాదు."

"పోనీ మీ అమ్మ నేర్పిన ఇంకో ఆటేదైనా ఆడదామా?"

"ఏం ఆడదాం?" రాజేష్ కాసేపు ఆలోచించి చెప్పాడు.

"ఆఁ 'గాంధీతాత' ఆడదామా?"

"గాంధీ తాత ఆటంటే?"

"మా అమ్మ స్కూల్లో పిల్లలచేత ఆడిస్తుంది. నేనేం చెప్పినా నువ్వు చెయ్యాలన్నమాట. కూర్చో అంటే వెంటనే కూర్చోకూడదు. 'గాంధీతాత కూర్చో' అంటేనే కూర్చోవాలి. అంటే 'గాంధీతాత కూర్చో' అనకుండా నేను పుట్టినే కూర్చో అన్నాననుకో - నువువ్ కూర్చుంటే ఓడిపోయావన్నమాట. అర్థమైందా తాతయ్యా?"

"ఊఁ రెడీ."

"కూర్చో తాతయ్యా" చెప్పాడు రాజేష్.

దశరథరామయ్య కుర్చీలో కూర్చున్నాడు.

"ఓడిపొయ్యావ్ తాతయ్యా. నేను 'గాంధీతాతా కూర్చో' అనకుండానే కూర్చున్నావ్" చెప్పాడు రాజేష్.

"పోనీ ఇంకొకసారి. గాంధీతాత లేచి నిలబడు."

దశరథరామయ్య లేచి నిలబడ్డాడు.

"గాంధీతాత కళ్ళు మూసుకో."

కనురెప్పలు మూశాడు దశరథరామయ్య.

"గాంధీతాతా! చెయ్యి పైకీ కిందకీ ఓసారి వూపు."

అలా చేశాడాయన.

"గాంధీతాతా! తల గోక్కుంటూండు."

దశరథరామయ్య గోక్కున్నాడు.

"గాంధీతాతా! ఆపు."

చిరునవ్వుతో ఆపాడు.

"గాంధీతాతా! కళ్ళు మూసుకో."

కళ్ళు మూసుకున్నాడాయన.

"గాంధీ.. కళ్ళు తెరిచి చూడు ఎవరో వచ్చారు" చెప్పాడు రాజేష్.

దశరథరామయ్య కళ్ళు తెరిచి చూశాడు కానీ ఎవరూలేరు.

రాజేష్ బిగ్గరగా నవ్వి చెప్పాడు.

"ఓడిపోయావ్. గాంధీ అన్నాగాని గాంధీతాతా అని పూర్తిగా అనలేదుగా."

"భలే తెలివిరా నీది."

"ఇట్లా అనే నేను మా అమ్మని ఓడిస్తాను. లేకపోతే ఓ పట్టాన ఓడిపోదు అమ్మ. ఇప్పుడు నువ్వు చెప్పు."

"గాంధీతాతా అన్నాక నేను 'నెహ్రూ చాచా' అంటాను. సరేనా?"

"అలాగే అను పోనీ. నేను రెడీ."

"నెహ్రూ చాచా! రెండు చేతులు పైకెత్తు."

ఎత్తాడు.

"నెహ్రూ చాచా ఒక చెయ్యి దింపు."

"ఏ చెయ్యి తాతయ్యా?"

"కుడి చెయ్యి."

"మళ్ళీ చెప్పు"

"కుడి చెయ్యి."

"మళ్ళీ చెప్పు"

"కుడిచెయ్యి దింపు."

రాజేష్ రెండు చేతులు ఎత్తిపట్టే వుంచాడు. కుడిచెయ్యి దింపలేదు.

"దింపమన్నాగా?"

"నెహ్రూచాచా చెప్పలేదుగా మరి."

"ఓఅదా! నెహ్రూ చాచా! రెండు చేతులూ దింపు."

రాజేష్ దింపాడు.

"వెనక్కి రెండడుగులు వెయ్యి."

రాజేష్ వెయ్యబోయి తమాయించుకుని ఆగాడు.

"నెహ్రూ చాచా రెండడుగులు వెనక్కి వెయ్యి" నవ్వాడాయన.

వేశాడు.

"గాంధీతాతా! ఏడు."

తల అడ్డంగా తిప్పాడు రాజేష్ నవ్వుతూ.

"నెహ్రూ చాచా నువ్వు ఆపు. ఏడు."

ఠక్కున నవ్వు ఆపేశాడు రాజేష్. ఏడుస్తున్నట్లు నటించసాగాడు దశరథరామయ్య దృష్టి రాజేష్ లాగూమీద పడింది.

"బాత్‌రూంకి వెళ్ళిరా. ఛీఛీ ఎన్నిసార్లు చెప్పాను పావుగంటకోసారి బాత్‌రూమ్‌కి వెళ్ళిరమ్మని."

రాజేష్ బాత్రూమ్‌కి వెళ్ళి ఆ నిక్కరు విప్పి వేరే నిక్కరు వేసుకుని రాగానే చెప్పాడు దశరథరామయ్య.

"ఓడిపోయావు."

"ఓహో అదా నీ తెలివి? ఇందాక 'నెహ్రూచాచా' చెప్పలేదుకదా నిజంగా కోప్పడ్డారనుకున్నా. సరే మళ్ళీ ఆడదాం పట్టు."

పది నిముషాల తర్వాత బన్ని వచ్చి చేరింది ఆ ఆటలో. ఎంతో ఉత్సాహంగా, వాళ్ళతో సమానంగా ఆడసాగింది. 'నెహ్రూచాచా' ఆటని.

"సర్కస్ ఎండాకాలంలో దొరికే తియ్యటి చల్లటి కొబ్బరి నీరులాంటిది. అది ప్రేక్షకులని తమ చిన్నతనంలోకి రెండు మూడుగంటల సేపు తీసుకెళ్ళగలదు. వాళ్ళని 'పాప'లుగా, 'బాబు'లుగా మార్చగలదు.

బఫూన్స్, ఏనుగులు, సింహాలు, అందమైన అమ్మాయిలు ఎర్రగొన్లలో తెల్లగుర్రాల మీద ఫీట్స్ చేయటం, ఒంటిచక్రం సైకిళ్ళు అదీ సర్కస్. సర్కస్‌లోని ఏ ఐటమ్ తీసుకుని ఎనలైజ్ చేసినా, అది ప్రతి పెద్దవాళ్ళలో ఎప్పటికీ పోని చిన్నతనం కోసం ప్రదర్శిస్తున్నట్లుగా వుంటుందనుకుంది నీరజ.

రంగురంగుల పోస్టర్స్ కొన్ని రకరకాల జంతువుల బొమ్మలు, పెద్ద పెద్ద అక్షరాలు పిల్లలని విపరీతంగా ఆకర్షిస్తాయి. పిల్లలకి సర్కస్ విషయంలో అతిశయోక్తులంటే యిష్టం. సర్కస్ గుడారాల్లో రెండు పులులని చూస్తే పాతికదాకా వున్నాయని స్నేహితులకి చెప్తాడు. ఆ విషయంలో పందెం వెయ్యాల్సొస్తే లక్షరూపాయలకి తక్కువ పందెం వెయ్యడు ఓ చిన్నపిల్లవాడు.

సర్కస్ టెంట్‌లోకి ప్రవేశించిన ప్రతి పెద్దవాళ్ళు 'బయటకి వచ్చేదాకా చిన్నపిల్లలే' అనుకుంది నీరజ పూర్తిగా నిండిన టెంట్‌ని.

వాళ్ళకి ఎరీనాకి ముందున్న మూడో వరసలో దొరికాయి సీట్లు. నాలుగునుంచి తొంభై ఏళ్ళ వయసుగల పిల్లలముందు సర్కస్ మొదలయింది. రాజేష్ ఎంతో వుత్సాహంతో చూస్తున్నాడు. బఫూన్స్ ఆకారాలని చూడగానే పగలబడి నవ్వుతున్నాడు. అతి పొట్టి బఫూన్ పిల్లిమొగ్గలు వేసినా, ఒకర్నొకరు కర్రలతో చప్పుడయ్యేలా కొట్టుకున్నా, వద్దన్నా బలవంతంగా చక్కలిగింతలు పెట్టినట్లు నవ్వుతున్నాడు రాజేష్ తన్మయత్వంగా చూస్తూ.

ఎలుగుబంటి, పులులతో చేసిన ఫీట్స్‌ని సీటు అంచుమీద కూర్చుని చూస్తున్నాడు. ఒకే చక్రంగల సైకిల్‌ని నడుపుతున్న వ్యక్తిమీదకి ఏడుగురు ఎక్కి పడకుండా వుండగలగడం విప్పారిత నేత్రాలతో సీటుమీద లేచి చూస్తున్నాడు. సర్కస్‌లోని బేక్‌గ్రౌండ్ మ్యూజిక్ అనుగుణంగా ఒకో ఫీట్ జరిగిపోతూంటే రాజేష్ కనురెప్పలు వెయ్యకుండా చూస్తున్నాడు

ఆ కుర్రాడిలోని థ్రిల్ ఎక్సయిట్‌మెంట్ పక్కనే కూర్చున్న దశరథరామయ్యకి, ఆయన కొడుకు, కోడలికి కూడా పాకినట్లయింది.

సూటు, బూటు వేసుకుని టై కట్టుకున్న చింపాంజీ పిల్ల చిన్న మోపెడ్ పై ఎరీనాలో గుండ్రంగా తిరుగుతూ, బఫూన్లమీదకి మోపెడ్‌ని పోనిస్తుంటే వాళ్ళు అరుస్తూ, భయపడుతూ లేస్తూ తప్పుకోవడం, చివరికి లోపలికి పారిపోవడం, చింపాంజీ ప్రేక్షకులకి కుడిచేత్తో టాటా చెప్పి లోపలికి వెళ్ళిపోవడం రాజేష్ మునికాళ్ళమీద నిలబడి చూశాడు. చింపాంజీ వెళుతుంటే రాజేష్ కూడా చేతిని వూపి టాటా చెప్పాడు.

అకస్మాత్తుగా మ్యూజిక్ ఆగిపోయింది. క్రమంగా ఎరీనామీద వెలిగే లైట్లు ఆరిపోయి అక్కడంతా చీకటి ఏర్పడింది. లౌడ్ స్పీకర్‌లో ఇంగ్లీషులో ముందు, తర్వాత హిందీలో వినపడ్డాయి మాటలు.

"లేడీస్ అండ్ జంటిల్ మెన్. మీరు ఈ ప్రదర్శనని చూడటానికి వచ్చినందుకు మా కృతజ్ఞతలు. ఈ ప్రదర్శనలన్నీ మీకు ఆనందం కలగ చేస్తున్నాయనే మా విశ్వాసం. ఇప్పుడు మేం ప్రదర్శించబోయే వేనిషింగ్ యెలిఫెంట్ ఏక్ట్. ఏనుగు అదృశ్యం అవటం. అనే ఐటమ్ ప్రపంచంలో కేవలం మా సర్కస్ కంపెనీనే ప్రదర్శిస్తుంది. అన్ని ఆటలలోనూ ఈ ప్రదర్శన వుండదు. ఇవాళ మీరు చూడగలగడం మీ అదృష్టంగా భావించవచ్చు."

బేక్ గ్రౌండ్ మ్యూజిక్‌తోపాటు అకస్మాత్తుగా ఎరీనా మీద లైట్లు వెలిగాయి.

ఎదురుగా ఇనుప చువ్వలతో చేసిన పెద్ద బోను పైభాగం మాత్రం తెరచి వుంది. సరిగ్గా ఏనుగు పట్టగలిగేంత పరిమాణం వున్న ఆ బోనులో ఓ ఏనుగు నిలబడి వుంది. దాని వీపుమీద ఓ మరుగుజ్జు బఫూన్ కూర్చుని వున్నాడు చేత్తో ఐస్‌ఫ్రూట్ తింటూ.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in